క్లుప్తంగా

ఫార్మకాలజీ క్లినికల్ ల్యాబ్ ప్రారంభం



గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజ్ ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కె. సాల్మన్‌రాజు తన తండ్రి గమలియల్ జ్ఞాపకార్థంగా రూ.3 లక్షలతో ఆధునికీకరించిన క్లినికల్ ఫార్మకాలజీ ల్యాబ్‌ను గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. వైద్య విద్యార్థులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఫార్మకాలజీ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ల్యాబ్‌ను ఆధునికీకరించేందుకు విరాళం అందించిన డాక్టర్ సాల్మన్‌రాజును అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ఫార్మకాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ కె.శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా గౌరీశంకర స్వామి కల్యాణ మహోత్సవం



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. బాలపూజ యాగశాలలో నిత్య జత హోమాలు, దేవాలయంలో గంగా గౌరీ సమేత గౌరీశంకర స్వామికి మహన్యాస ఏకాదశి రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అనంతరం గంగా గౌరీ సమేత గౌరీశంకరస్వామి శాంతి కల్యాణ మహోత్సవాన్ని సామూహికంగా చేపట్టారు. ఎస్‌వీ రమణ మూర్తి భాగవతార్ (బొబ్బిలి) ఆధ్వర్యంలో మహాభారతం నుంచి శ్రీకృష్ణరాయబారం హరికథా గానం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించగా, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సత్తా చాటిన జీఎంసీ విద్యార్థులకు అభినందనలు



గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీ పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన పీజీ వార్షిక పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, గుంటూరు వైద్య కళాశాల ఖ్యాతి ఇనుమడింపజేశారు. పెథాలజీ విభాగానికి చెందిన డాక్టర్ షణ్ముఖ ప్రియ 800 మార్కులకు గాను 563 మార్కులు సాధించి యూనివర్సిటీ టాపర్‌గా నిలువగా డాక్టర్ పోలిశెట్టి దుర్గ హరిత ఫిజియాలజీ విభాగంలో అత్యధిక స్థాయిలో మార్కులు సాధించింది. సోమవారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్‌లు అత్యధిక స్థాయి మార్కులను సాధించిన వైద్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ కమల ప్రభాకరరావు, పాటిబండ్ల పవన్‌రాయ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

నగరంపాలెం: గంజాయి విక్రయించే యువకుడ్ని కొత్తపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. నరసరావుపేట పట్టణం బీసీ కాలనీకి చెందిన బి.హేమలయ్య అలియాస్ హేమంత్, తక్కెళ్లపాడుకి చెందిన ఆదాంషఫీ రెండు కిలోల గంజాయితో గుంటూరు నగరానికి వచ్చారు. బస్ ఎక్కే క్రమంలో మణిపురం ఫ్లెటోవర్ బ్రిడ్జి కింద ఇద్దరు వేచి ఉన్నారు. ముందస్తు సమాచారంతో కొత్తపేట పీఎస్ ఎస్‌ఐ హనుమంతరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఆదాంషఫీ అక్కడి నుంచి వెళ్లిపోగా, అనుమానాస్పదంగా ఉన్న హేమంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద సోదాలు నిర్వహించగా రెండు కిలోల గంజాయిని గుర్తించారు. దీంతో అతడిని అరెస్ట్ చేసి గంజాయి సీజ్ చేశారు. హేమంత్, ఆదాంషఫీ స్నేహితులని, ఇద్దరు కలిసి నర్సీపట్నం నుంచి గంజాయి తీసుకువచ్చారని విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు.

ఊబకాయం పెరుగుతోంది..

నేడు వరల్డ్ ఒబెసిటి డే

- అధికబరువు అనర్థాలకు కారణం
- పిల్లలు, యువతలోనూ ఆందోళన

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనవిధానం, మారిన ఆహారపు అలవాట్లుతో పాఠశాల చదివే పిల్లవాడు మొదలుకొని యవకులు, పెద్దల వరకు అన్ని వయస్సుల్లోనూ అధిక బరువుతో(ఊబకాయం) బాధపడుతున్న వారి సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. ఏటా మార్చి 4న వరల్డ్ ఒబెసిటి డే నిర్వహిస్తున్నారు.



బరువు పెరగటానికి కారణాలు...

తిన్నది అరగకపోవటం వల్లే బరువు పెరుగుతున్నారు. శాక్రిన్‌తో ఉన్న తీపి పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్స్ ఊబకాయానికి కారణమవుతున్నాయి. శరీరానికి సరైన వ్యాయామం లేకపోవటం, ఎక్కువ సేపు టీవీలకు అతుక్కుపోవటం, జన్యుపర కారణాలు, కుటుంబంలో ఒకరికి ఊబకాయం ఉంటే, కొన్ని రకాల మందుల వల్ల, స్మోకింగ్, కంటికి సరిపడా నిద్రలేకపోవటం, స్మార్ట్‌ఫోన్‌లతో అధిక సమయం గడిపేయటం వలన ఊబకాయం బారిన పడుతున్నారు. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ఆకస్మికంగా బరువు పెరుగుతారు.

ఇతర రోగాలు వస్తాయి...

ఊబకాయంతో అధిక రక్తపోటు, హార్ట్‌ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్, మధుమేహం, కిడ్నీ వ్యాధులు, ఆస్టియోపొరాసిస్, స్లీప్ అప్నీయా ,రొమ్ముక్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, ఓవరీస్ క్యాన్సర్, లివర్ క్యాన్సర్, గాలబ్లాడర్ క్యాన్సర్,ఇతర వ్యాధులు కూడా వస్తాయి . సంతానం కలుగదు. ఆడ వారిలో పీసీఓడి సమస్యలు వస్తాయి. పిల్లల్లో అధిక రక్తపోటు, బ్రీతింగ్ సమస్యలు, సైకలాజికల్ సమస్యలు, ఫ్యాక్చర్లు ఏర్పడతాయి.

జిల్లాలో బాధితులు...

జిల్లాల్లో ఐదుగురు బేరియాట్రిక్ సర్జన్స్ ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు నెలకు 100 నుంచి 200 మంది అధిక బరువు బాధితులు చికిత్స కోసం సంప్రదిస్తున్నారు.

ఊబకాయులకు శ్వాసకోశ సమస్యలు



అధిక బరువు ఉన్న వ్యక్తి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు, లివర్ సాధారణం కంటే రెట్టింపు పనిచేయాల్సి ఉంటుంది. ఛాతిలో పేరుకున్న కొవ్వుతో శ్వాసకోశ సమస్యలు, బ్రాంకైటిస్ వస్తాయి. పెరిగిన కొవ్వు వల్ల హైపర్ ఇన్సులిమియా సంభవిస్తుంది. దీని వల్ల మధుమేహం వస్తుంది. రోగ నిరోధక శక్తిని ఊబకాయం తగ్గిస్తుంది. ఇది ఊపిరితిత్తులపై ఒత్తిడి పెంచుతుంది.

–డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

గుండెకు ముప్పు



సాధారణ ప్రజలతో పోల్చితే ఊబకాయులకు గుండెపోటు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. రక్తనాళాల్లో ఎక్కువగా చెడు రక్తం పేరుకుపోయి గుండెపోటుకు దారితీస్తుంది. బీపీ, షుగర్‌లు కూడా ఊబకాయులను అటాక్ చేస్తాయి. ఈ రెండు జబ్బుల వల్ల గుండె జబ్బులు వస్తాయి. పిల్లల్లో కూడా అధిక బరువు ఉంటే వారికి గుండెజబ్బు సోకుతుంది.

–డాక్టర్ పోలవరపు అనురాగ్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు

బెలూన్ చికిత్సతో బరువు తగ్గవచ్చు



బెలూన్ చికిత్సతో అతి సులువుగా బరువు తగ్గవచ్చు. ఎలాంటి కోత, కుట్లు లేకుండా బరువు తగ్గేందుకు ఈ చికిత్స అందుబాటులో ఉంది. బెలూన్ పెట్టిన నెలరోజుల వ్యవధిలో పది కిలోల బరువు తగ్గుతారు. ఈ చికిత్సా విధానం చేసేందుకు కేవలం పది నిమిషాల సమయం మాత్రమే పడుతుంది.

– డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు

ఊబకాయంపై అవగాహన సదస్సు నేడు

గుంటూరు మెడికల్: ప్రపంచ ఉబకాయ(ఒబెసిటీ) దినోత్సవం సందర్భంగా స్థానిక కొత్తపేట భగత్ సింగ్ సెంటర్ పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో మంగళవారం అధికబరువుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ అధినేత, ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ వీవీ రామ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఉచిత అవగాహన కార్యక్రమంతో పాటు బాగా లావుగా ఉండే వ్యక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేడు ఆటో డ్రైవర్ల ధర్నా

లక్ష్మీపురం: సమస్యలతో దుర్భరమైన జీవితాలు గడుపుతున్న ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగ శ్రీనివాసరావు, ఆకిటి అరుణ్ కుమార్ సోమవారం కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల ప్రకారం వాహన మిత్ర పథకం రూ.15 వేలు వెంటనే ఆటో కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 21, 31 లను రద్దు చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమంలో గుంటూరు జిల్లాలోని ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అనధికార, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో అనుమతులు లేని, నగరపాలక సంస్థ నుంచి అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ పనులు ప్రారంభించిన నాటి నుంచే నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం 2024 డిసెంబర్ 17న వెలువరిచిన ఉత్తర్వుల మేరకు ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ ఆదేశాలను అనుసరించి రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, రాష్ట్రంలో అనధికార కట్టడాల నిరోధానికి ప్రత్యేక మార్గదర్శకాలను అమలు చేయాలని ఫిబ్రవరి 2న ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. సదరు ఉత్తర్వులను గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో తక్షణం అమలులోకి వస్తాయని, భవన నిర్మాణదారులు, బిల్డర్లు విధిగా పాటించాలని, అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. భవన నిర్మాణానికి అనుమతులిచ్చే సమయంలోనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందిన తర్వాతనే భవనంలోని నివాసానికి అనుమతి ఇస్తామని అందుకు అనుగుణంగా భవన నిర్మాణ యజమాని నుండి అంగీకార పత్రం తీసుకుంటామన్నారు. భవన నిర్మాణదారులు భవన నిర్మాణాలు పూర్తి అయ్యే వరకు నిర్మాణ అనుమతి ప్లాన్‌ని ముందువైపు ఏర్పాటు చేసి ఉండాలన్నారు.

నిర్మాణ సమయంలో ఉల్లంఘనలు జరగకుండా పట్టణ ప్రణాళిక అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తారని, భవన నిర్మాణ యజమాని విధిగా రిజిస్టర్ నిర్వహించాలని, సంబంధిత వార్డు ప్రణాళిక అధికారులు నిర్మాణ దశలో ఉన్న భవనాలను తనిఖీలు నిర్వహించేప్పుడు సదరు రిజిస్టర్‌లో తనిఖీ చేసిన తేదీతో పాటు, నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నదీ, లేనిదీ పూర్తి వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. భవన నిర్మాణంలో ఒప్పందాలను, నిబంధనలను ఉల్లఘించినట్లు తనిఖీల్లో గుర్తిస్తే సదరు నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ నిలిపుదల చేస్తామని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆక్యుపెన్సీ పొందిన అనంతరం కూడా అనధికార నిర్మాణాలు చేస్తే, నిర్మాణాలను అతిక్రమించిన చర్యలు తప్పవన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని భవనాలకు తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేయడం కుదరదని చెప్పారు. అక్రమ నిర్మాణాల్లో వ్యాపారాల నిర్వహణకు ట్రేడ్, వ్యాపారాలకు సంబంధించిన అన్ని రకాల అనుమతులు మంజూరు చేయబడవన్నారు. బ్యాంక్ లు, ఇతర ఆర్థిక సంస్థలు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉన్న భవనాలకే రుణాలు మంజూరు చేస్తాయన్నారు. అతిక్రమించిన నిబంధనలను క్రమబద్ధీకరించుకొని ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన 90 రోజుల్లోగా అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన, తుది అనుమతులను జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.

క్రిస్టియన్ మైనార్టీ సమస్యలపై పోరాటం చేయాలి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా

నెహ్రూ నగర్: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన వాసిమల్ల విజయ్ ఆ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమాను సోమవారం ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో క్రిస్టియన్ మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి చేయాలని ఆమె సూచించారు.



నూరి ఫాతిమాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయ్

ఉద్యోగాలకు 50 మంది విద్యార్థుల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్- ప్లేస్‌మెంట్స్ విభాగ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఫస్ట్‌సోర్స్ నిర్వహించిన జాబ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 50 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం సోమవారం తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలను సాధించడంలో భాషా నైపుణ్యం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు కీలకమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి జాబ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ముందుగా విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్, టైపింగ్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికలు జరిగినట్లు వివరించారు. ఈసందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.భానుమురళీధర్, పీజీ కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ డీవీ చంద్ర శేఖర్, ప్లేస్‌మెంట్ అధికారి సీహెచ్ చంద్రశేఖర్, సభ్యులు జి.సురేష్‌కుమార్, బి.శ్రీనివాసరావు, ఎం.మార్కండేయులు పాల్గొన్నారు.



వైద్య పరికరాలు విదేశాలకు ఎగుమతి



మాట్లాడుతున్న అంజుల్ జైన్

గుంటూరు ఎడ్యుకేషన్: దేశీయంగా వైద్య పరికరాలను ఉత్పత్తి చేస్తున్న సంస్థలు భవిష్యత్‌లో విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని గుజరాత్‌లోని పారిశ్రామిక నగరం వాపిలోని మెరిల్ లైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ మేనేజర్ అంజుల్ జైన్ పేర్కొన్నారు. సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మసూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో వైద్య పరికరాల తయారీ, నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ వైద్య పరికరాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెరిల్ లైఫ్ సైన్సెస్, హిందూ ఫార్మసీ కళాశాలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదన రావు, ఫార్మా డీ డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మసూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్ డిపార్టుమెంటు అధ్యాపకులు జి.రామకృష్ణ, ఎం.బీనాదేవి, చల్లా ఆదిలక్ష్మి, షేక్ సంజూద పాల్గొన్నారు. హిందూ మేనేజ్ మెంట్ కళాశాలతో గుజరాత్‌కు చెందిన మెరిల్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింగరాజు వెంకట రమణ తెలిపారు. సోమవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెరిల్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి పనిచేయడం వలన విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ, ఉద్యోగ అవకాశాలను అందించగలమని విశ్వసిస్తున్నామని చెప్పారు.

టీవీ ఛానల్ కార్యాలయం పెడదామంటూ మోసం

లక్ష్మీపురం: ఇంట్లో టీవీ ఛానల్ కార్యాలయం పెడతామంటూ రూ.30 లక్షలు నగదు తీసుకుని మోసం చేసిన ఇద్దరిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. యనమదల ప్రాంతానికి చెందిన అరిగెల అరుణ్‌కుమార్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ సంస్థలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అరుణ్‌కుమార్ పెదనాన్న కుమార్తె అమరలింగేశ్వరి మానసిక వికలాంగురాలు కావడంతో ఆమె బాగోగులు చూసుకుంటూ ఉన్నందున ఆమె పేరుతో ఉన్న ఆస్తి వీలునామాను పెద నాన్న అరుణ్‌కుమార్‌కు రాశాడు. అయితే 2022లో అమరలింగేశ్వరి అనారోగ్య కారణంగా మృతి చెందింది. అయితే అమరలింగేశ్వరి పేరుతో గురజాలలో మూడంతస్తుల భవనానికి సంబంధించి పూర్తి హక్కుదారుడుగా ఉన్న అరిగెల అరుణ్‌కుమార్‌కు పెదనాన్న కుమారులకు మధ్య ఆస్తి వివాదం మొదలైంది. అదే సమయంలో గుంటూరు బృందావన్‌గార్డెన్స్ 6వలైన్‌లో ఉన్న టి.వి-2 నిర్వాహకుడు శ్రీకాంత్ మహేష్, వాటదారుడు భూవనం శ్రీనివాసరావు పరిచయం అయింది.

గురజాలలో ఉన్న ఇంటి ఆస్తి వివాదం నడుస్తున్న నేపథ్యంలో ఆ భవనంలో టి.వి.-2 కార్యాలయాన్ని పెట్టడం వల్ల ఎవరు దాని జోలికి రారని చెప్పి నమ్మబలికారు. అప్పటి నుంచి పలు మార్లు రూ.30 లక్షలు టి.వి. ఛానల్ పెట్టేందుకు ఖర్చు అవుతుందని చెప్పి అరుణ్‌కుమార్ నుంచి నగదు ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నారు. అలాగే మరికొంత నగదు అవసరం ఉందని చెప్పి అరుణ్‌కుమార్ డబ్బు లేదని చెప్పినప్పటికి ప్రామిసరి నోట్ల పై సంతకాలు తీసుకుని ఫైనాన్సర్‌ల వద్ద నగదు తీసుకుందామని చెప్పి పూర్తిగా మోసం చేశారు. మోసాన్ని గుర్తించిన బాధితుడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఎస్పీ ఆదేశాల మేరకు పట్టాభిపురం ఎస్‌ఐ ఆంజనేయులు మోసం చేసిన శ్రీకాంత్ మహేష్, భూవనం శ్రీనివాసరావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూజలు చేస్తే రూ.కోట్లు వస్తాయని..

లక్ష్మీపురం: పూజలు చేయడం వల్ల కోట్లాది రూపాయలు వస్తాయని నమ్మబలికి రూ.15 లక్షలు వరకు నగదు తీసుకుని మోసం చేసిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ప్రకారం రాజేశ్వర కాలనీ 2వ లైన్ ప్రాంతానికి చెందిన మన్నెం నాగేశ్వర రావు, ఉపాధ్యాయుడిగా చేసి రిటైర్డ్ అయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన భారతి అనే మహిళతో పరిచయం అయింది. భారతి నరసరావుపేటకు చెందిన బొమ్మలబోయిన వెంకాయమ్మ అలియాస్ నాగమణి అమ్మ అనే పేరు గల మహిళను పరిచయం చేసింది. నాగమణి అమ్మ వద్ద మణి ఉందని, పూజలు చేయడం వలన రూ.100 కోట్లు వస్తాయని చెప్పి నాగేశ్వర రావును నమ్మబలికారు. దీంతో 2024 మే 16వ తేదీ నుంచి పలు మార్లు నాగమణిఅమ్మ అనే మహిళ గుంటూరు రాజేశ్వరకాలనికి వచ్చి పూజలు చేయాలంటూ విడతల వారిగా సుమారు రూ.15 లక్షల వరకు నగదు తీసుకుంది. నగదు తీసుకున్న నాగమణిని బాధితుడు నిలదీయడంతో మోసం చేశారని తెలుసుకున్నాడు. దీంతో దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలకు విద్యార్థినులు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ గత నెలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ బి.రోహిణీదేవి తెలిపారు. లక్ష్మీపురంలోని కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రాథమికంగా 17 మంది విద్యార్థినులు ఎంపిక కాగా, వారిలో తుది విడతలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ఆరుగురు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు.



విద్యార్థినులతో బీఎస్సార్కే ప్రసాద్, రోహిణీదేవి

నగరంపై డ్రోన్ కెమెరాలతో నిఘా

- వేగంగా వెళ్లే వాహనాల నంబర్ ప్లేట్ల గుర్తింపు
- ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే డ్రోన్ కెమెరాల దృశ్యాలతో జరిమానా
- ముగ్గురు ప్రయాణించినా, రేస్ పోటీలు నిర్వహించిన వాహనాలు జప్తు




డ్రోన్ కెమెరా పనితీరుని పరిశీలిస్తున్న సీఐ అశోక్‌కుమార్

నగరంపాలెం: ఇక నుంచి గుంటూరు నగర పరిసర ప్రాంతాలను నిరంతరం డ్రోన్ కెమెరాలతో గస్తీ నిర్వహించనున్నట్లు తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్(పీఎస్) సీఐ ఎ.అశోక్ తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తూర్పు ట్రాఫిక్ పీఎస్, లాలాపేట పీఎస్ పరిధిలోని ఎంటీబీ సెంటర్, హిమని సెంటర్, పల్నాడు బస్టాండ్, ఎత్తురోడ్డు, పూలకొట్ల బజారు, నల్లచెరువు ప్రధాన రహదారి, దర్గా ప్రాంతాల్లో డ్రోన్ గస్తీని సోమవారం రాత్రి చేపట్టారు. ఆయా ప్రదేశాల్లో వాహనాల కదలికలు, నిలుపుదల చేసే ప్రదేశాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ మాట్లాడుతూ అధునాతమైన సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా వచ్చే, పోయే వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించే డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తామని చెప్పారు. అతివేగం, ప్రమాదకరంగా వాహనాలు నడిపే చోదకులు, ముగ్గురు ప్రయాణించడం, రేసింగ్ పోటీలను కట్టడి చేసేందుకు దోహదపడుతుందని అన్నారు. డ్రోన్ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా కేసులు నమోదు చేసి వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ 11 కేవీ ఫీడర్ లైన్ రెండు విభాగాలుగా విభజించడం కారణంగా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-2 డీఈఈ ఎన్.గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. ఉద్యోగ నగర్, ఎస్‌వీఎన్ కాలనీ, నేతాజీ నగర్, వైష్ణవీనగర్, తారకరామ నగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గజ వాహనంపై శ్రీవారి నగరోత్సవం



మాట్లాడుతున్న శ్రీవిశ్వంభరానంద గిరిస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహాకుంభాభిషేక మహోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేశారు. టీటీడీ ఆగమశాస్త్ర పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అగ్నిహోత్ర శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో కుంభారాధన, నవగ్రహ, సుదర్శన హోమాలు, వేదస్వస్తి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై ఉభయ దేవి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తుల నగరోత్సవం నిర్వహించారు. శ్రీ వశిష్ఠాశ్రమ ఉత్తర పీఠాధిపతి, సర్వాధికార ప్రతినిధి శ్రీవిశ్వంభరానందగిరి స్వామి(కారంచేడు) భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. సాహితీవేత్త నోరి నారాయణమూర్తి వ్యాఖ్యతగా వ్యవహరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ఆవుల అచ్యుతరామయ్య, ఉప న్యాసకులుగా నారాయణం ప్రసాదాచార్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యులు నిమ్మల శేషయ్య, ప్రముఖ వ్యాపారవేత్త చుక్కపల్లి రమేష్, ప్రముఖ విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, కిట్స్ విద్యా సంస్థలు నిర్వాహకులు కోయ సుబ్బారావు, న్యాయవాది చిలుకూరి నరేంద్రబాబు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, కమిటి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టా ప్రభాకరరావు పాల్గొన్నారు.